విదేశీ విద్యా పథకానికి సర్కార్ తూట్లు

- కాంగ్రెస్ తీరుతో పేద విద్యార్థుల ఇక్కట్లు
- కాంట్రాక్టర్ల పనులకే డబ్బులు ఇస్తారా?
- పేదల చదువుకు బకాయిలు చెల్లించరా?
- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ధ్వజం

హైదరాబాద్, ఫిబ్రవరి 8 (నమస్తే తెలంగాణ): అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకం లక్ష్యానికి రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కార్ తూట్లు పొడుస్తున్నదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ధ్వజమెత్తారు. ఈ పథకం కింద స్కాలర్‌షిప్ నిధులను విడుదల చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం విదేశీ విద్యకు పేద విద్యార్థులను దూరం చేస్తున్నదని మండిపడ్డారు. ఈ పథకానికి ఎంపికైన విద్యార్థులతో శనివారం ఏర్పాటు చేసిన జూమ్ మీటింగ్‌లో కవిత మాట్లాడారు. ప్రభుత్వం ఫీజు రియింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయకుండా తాత్సారం చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ సదుద్దేశంతో ప్రవేశపెట్టిన ఈ పథకాన్ని సీఎం రేవంత్‌రెడ్డి నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. పేద విద్యార్థులకు విదేశీ విద్య అందాలన్నది కేసీఆర్ ఆలోచన అని తెలిపారు. రెండో విడత నిధులు ఎందుకు విడుదల చేయడం లేదో చెప్పాలని సర్కార్‌ను నిలదీశారు. స్కాలర్‌షిప్ అందక అనేకమంది విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. వారంతా స్కాలర్‌షిప్‌ల కోసం ఎదురుచూస్తున్నారని గుర్తుచేశారు. కాంట్రాక్టర్లకు ప్రభుత్వం బిల్లులు విడుదల చేస్తున్నదని, కానీ పేద విద్యార్థుల చదువులకు మాత్రం బకాయిలు చెల్లించడం లేదని మండిపడ్డారు. ఈ పథకంతోపాటు రాష్ట్రంలోని ఇతర స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయకపోవడం శోచనీయమని పేర్కొన్నారు. ప్రభుత్వం మొద్దునిద్రను వీడి తక్షణమే విద్యార్థుల ఫీజు బకాయిలను నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజాక్షేత్రంలో ప్రభుత్వ వైఖరిని ఎండగడతామని హెచ్చరించారు.

అక్రమ వసూళ్లు ఆపండి

- ఇసుక రీచ్‌ల వద్ద 3 వేల వరకు అదనంగా వసూలు
- రోజుకు రూ.2.30 కోట్ల దోపిడీ
- గనుల శాఖ ముఖ్య కార్యదర్శికి లారీ యజమానుల ఫిర్యాదు
- కొత్త ఇసుక పాలసీ వద్దని వినతి

హైదరాబాద్, ఫిబ్రవరి 8 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వం ఇసుక రవాణాను బడా కాంట్రాక్టర్లకు అప్పగించవద్దని లారీల యజమానుల సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం నాయకులు గనుల శాఖ ముఖ్యకార్యదర్శికి వినతిపత్రం సమర్పించారు. కొత్త విధానం అమల్లోకి వస్తే ఇసుక వ్యాపారాన్ని నమ్ముకుని జీవిస్తున్న తమకు ఆత్మహత్యే శరణ్యమని ఆవేదన వ్యక్తంచేశారు. కాంట్రాక్టర్లు దోపిడీకి పాల్పడుతూ తమపై వేధింపులకు దిగుతున్నారని వివరించారు. ప్రతీరోజు ఇసుక రీచ్‌ల వద్ద కాంట్రాక్టర్లు దాదాపు రూ.2.3 కోట్ల అక్రమాలకు పాల్పడుతున్నారని, వారిని కట్టడి చేస్తే ప్రభుత్వానికి ఆదాయం పెరుగుతుందని సూచించారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్ల నుంచి ఎదురవుతున్న ఇబ్బందులను ఏకరువు పెట్టారు. ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకుని, డీడీలు చెల్లించినా కూడా రీచ్‌ల వద్ద లోడుకు రూ.2,500 నుంచి రూ.3000 వరకు అదనంగా వసూలు చేస్తున్నారని, వద్దన్నా వినకుండా ఓవర్‌లోడ్ చేస్తున్నారని తెలిపారు. ఇదేంటని ప్రశ్నిస్తే ఇసుక లోడింగ్ చేయకుండా వెనక్కి పంపుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇసుక కాంట్రాక్టర్ల అక్రమాల వెనుక కొందరు అధికారుల పాత్ర కూడా ఉందని ఆరోపించారు. మరోవైపు ఓవర్‌లోడ్ వల్ల ఆర్టీవో, విజిలెన్స్, మైనింగ్, కమర్షియల్ ట్యాక్స్ అధికారులు రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు జరిమాన విధిస్తున్నారని చెప్పారు. బాధ్యులైన కాంట్రాక్టర్లపై మాత్రం చర్యలు తీసుకోవడం లేదని తెలిపారు. ప్రభుత్వం ఇసుక రవాణాను కొందరు కాంట్రాక్టర్లకు అప్పగించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు ప్రచారం జరుగుతున్నదని, ఒకవేళ అలాంటి ప్రతిపాదన ఉంటే వెనక్కి తీసుకోవాలని వేడుకున్నారు.

నాడు దీక్షలు చేసి..నేడు విస్మరిస్తరా?

- ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చేసింది రాజకీయమా? న్యాయపోరాటమా?
- మల్లన్నసాగర్ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించే బాధ్యత ముఖ్యమంత్రిదే
- బీఆర్ఎస్ హయాంలోనే 90శాతం పునరావాసం, మౌలిక వసతులు పూర్తి
- ఏడాదిగా పెండింగ్‌లో ఉన్న 10 శాతం పనులు త్వరగా పూర్తి చేయండి
- సీఎం రేవంత్‌కు హరీశ్‌రావు లేఖ

> మల్లన్నసాగర్ రిజర్వాయర్ నిర్వాసితులకు అండగా ఉంటానని ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న సమయంలో రేవంత్‌రెడ్డి నాడు ఏటిగడ్డ కిష్టాపూర్‌లో నిరాహారదీక్ష చేపట్టిండు. ఇప్పుడు ముఖ్యమంత్రి హోదాలో ఉన్నందున నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాల్సిన బాధ్యత రేవంత్‌రెడ్డిపై ఉన్నది.
> -లేఖలో హరీశ్‌రావు

హైదరాబాద్, ఫిబ్రవరి 8 (నమస్తే తెలంగాణ): మల్లన్నసాగర్ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాల్సిన బాధ్యత సీఎం రేవంత్‌రెడ్డిపై ఉన్నదని మాజీ మంత్రి హరీశ్‌రావు స్పష్టంచేశారు. సిద్దిపేట జిల్లాలో నిర్మించిన శ్రీకొమురవెల్లి మల్లన్నసాగర్ రిజర్వాయర్ నిర్వాసితులకు అండగా ఉంటానని ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న సమయంలో రేవంత్‌రెడ్డి నిరాహారదీక్ష చేపట్టిన విషయాన్ని గుర్తుచేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దాదాపు 90 శాతం ఆర్ అండ్‌ఆర్ ప్యాకేజీ, పునరావాస కాలనీల నిర్మాణం, ఇంటి స్థలాలు, మౌలిక సౌకర్యాలు కల్పించామని తేల్చిచెప్పారు. మిగిలిన 10శాతం సమస్యలు ఏడాది నుంచి పెండింగ్‌లోనే ఉన్నాయని పేర్కొన్నారు. నాడు నిరాహారదీక్ష చేసిన రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి నిర్వాసితులు తమ సమస్యలు పరిష్కారమవుతాయనే ఆశలు పెట్టుకున్నారని ఉదహరించారు. పెండింగ్ సమస్యల పరిష్కారంతోపాటు మరింత మెరుగైన సౌకర్యాలు, మెరుగైన పరిహారం అందిస్తారని ఎదురుచూస్తున్నారని తెలిపారు.

దేశంలోనే మెరుగైన ప్యాకేజీ ఇచ్చినం

మల్లన్నసాగర్ రిజర్వాయర్ నిర్మాణ సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన 2013 భూసేకరణ చట్టంతో నిర్వాసితులకు 121 గజాల ఇంటి స్థలం, రూ. లక్షా 25 వేలు మాత్రమే ఇవ్వాలనే నిబంధన ఉన్నదని, లక్షలాది మంది రైతుల కోసం త్యాగాలు చేసిన నిర్వాసితులకు మెరుగైన పరిహారం ఇచ్చేందుకు బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ చరిత్రాత్మకమైన నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. దేశ చరిత్రలోనే ఏ రాష్ట్ర ప్రభుత్వమూ అమలు చేయని విధంగా మెరుగైన ప్యాకేజీని మల్లన్నసాగర్ నిర్వాసితుల కోసం నాడు ముఖ్యమంత్రి హోదాలో కేసీఆర్ అమల్లోకి తెచ్చారని చెప్పారు. ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద ప్రతీ నిర్వాసితుడికి గజ్వేల్ పట్టణ సమీపంలోనే 250 గజాల ఇంటిస్థలం, ఇంటి నిర్మాణానికి రూ. 5.04 లక్షలు, రూ.7.50 లక్షల పరిహారం అందించామని వివరించారు. 18 ఏండ్ల వయస్సు నిండిన ప్రతి ఒక్కరికీ రూ.5 లక్షల పరిహారం, 250 గజాల ఇంటి స్థలం కేటాయించామని తెలిపారు. వీటితోపాటు పాత ఇండ్ల నిర్మాణ స్ట్రక్చర్‌కు కూడా సరైన లెక్క కట్టించి పరిహారం ఇచ్చామని గుర్తుచేశారు. ఆ ప్యాకేజీతోపాటు నిర్వాసితులకు వారి గ్రామాల పేరిట ఆర్‌అండ్‌ఆర్ కాలనీలు నిర్మించి బీఆర్ఎస్ ప్రభుత్వం కొనసాగేవరకు అన్ని వసతులను దశలవారీగా సమకూర్చామని తెలిపారు. అందుకోసం రూ.1260 కోట్లు ఖర్చు చేసి నిర్వాసితులకు అత్యంత ప్రాధాన్యత కల్పించామని పేర్కొన్నారు. ఈ నిధులతో 90 శాతం పనులను చకచకా పూర్తిచేశామని పేర్కొన్నారు. మిగతా 10 శాతం పనులతో పాటు కోర్టు కేసుల్లో తీర్పు వచ్చినవారికి, అక్కడక్కడ ప్యాకేజీ మిస్సయినవారికి పరిహారం అందించాల్సి ఉన్నదని తెలిపారు.

మిగిలిన పనులను పూర్తి చేయాలి

మల్లన్నసాగర్ కింద 90 శాతం పనులు పూర్తయ్యాయని, మిగిలిన 10 శాతం పూర్తి చేయాల్సిన బాధ్యత రేవంత్‌సర్కార్‌పై ఉన్నదని హరీశ్ స్పష్టంచేశారు. ప్రభుత్వం మారిన క్రమంలో మిగతా పనులను పూర్తి చేయలేక పోయామని, ముంపు గ్రామాలకు చెందిన వితంతువులను కూడా కుటుంబంగా పరిగణించి వారికి ప్యాకేజీ ఇవ్వాలని ఇటీవల హైకోర్టు తీర్పు వెల్లడించిందని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో వెంటనే వితంతువులకు పరిహారం అందించి వారి కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. లక్షలాది ఎకరాలకు సాగునీటితోపాటు హైదరాబాద్ సహా అనేక ప్రాంతాలకు తాగునీటి కష్టాలను తీరుస్తున్న మల్లన్నసాగర్ రిజర్వాయర్ నిర్మాణం వెనుక నిర్వాసితుల త్యాగాలు ఉన్నాయని గుర్తుచేశారు. రేవంత్ సర్కార్ వచ్చాక ఆ రిజర్వాయర్‌ను పూర్తిగా సద్వినియోగం చేసుకుంటున్నదని తెలిపారు. హైదారాబాద్ తాగునీటి అవసరాలతో పాటు మూసీ నదిలోకి గోదావరి జలాలను తరలించేందుకు మల్లన్నసాగర్‌పై ఆధారపడ్డారని, అక్కడి నుంచే 20 టీఎంసీల నీటిని హైదరాబాద్ తరలించేందుకు టెండర్ల ప్రక్రియ కూడా చేపడుతున్నట్టు తెలుస్తున్నదని పేర్కొన్నారు.

> కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోయిందని, కాళేశ్వరంతో ప్రయోజనం లేదని విమర్శించిన రేవంత్‌రెడ్డి, కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగంగా ఉన్న మల్లన్నసాగర్ రిజర్వాయర్ నీళ్ల కోసం ఎందుకు తాపత్రయపడుతున్నరు? నాడు మేము తక్కువ పరిహారం ఇచ్చామని ఆరోపణలు చేసిండ్రు. ఇప్పుడు సీఎం హోదాలో ఎక్కువ పరిహారం ఇచ్చి నిర్వాసితుల దగ్గర మీ మాట నిలబెట్టుకోవాలె.
> - లేఖలో హరీశ్‌రావు

రాజకీయమా? న్యాయపోరాటమా? తేలాలి

కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోయిందని, కాళేశ్వరంతో ప్రయోజనం లేదని విమర్శించిన రేవంత్‌రెడ్డి, కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగంగా ఉన్న మల్లన్నసాగర్ రిజర్వాయర్ నీటి కోసం ఎందుకు తాపత్రయపడుతున్నారని హరీశ్ ప్రశ్నించారు. నాడు నిరాహారదీక్ష చేపట్టిన సమయంలో రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్ ప్రభుత్వంపై దుమ్మెత్తి పోసి, నిర్వాసితులకు మెరుగైన పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేసిన విషయాన్ని గుర్తుచేశారు. 'మేము తక్కువ పరిహారం ఇచ్చామని మీరు ఆరోపణలు చేశారు. ఇప్పుడు సీఎం హోదాలో ఎక్కువ పరిహారం ఇచ్చి నిర్వాసితుల వద్ద మీ మాట నిలబెట్టుకోవాలి. నిరాహారదీక్ష పేరిట ఆనాడు మీరు చేసింది రాజకీయమా? న్యాయ పోరాటమా ? అనేది మీ నిర్ణయాన్ని బట్టి తేలిపోతుంది' అని లేఖలో పేర్కొన్నారు. మల్లన్నసాగర్ విషయంలో ప్రతిపక్షంలో మాట్లాడిన మాటలను అధికారంలోకి రాగానే విస్మరించారని విమర్శించారు. మల్లన్నసాగర్‌ను పూర్తిగా సద్వినియోగం చేసుకున్న రేవంత్‌రెడ్డి అదే మల్లన్నసాగర్ నిర్వాసితుల పరిస్థితిని మానవ తాదృక్పథంతో అర్థం చేసుకొని ఒక ముఖ్యమంత్రిగా వారిని ఆదుకోవాలని లేఖలో స్పష్టం చేశారు.

ఢిల్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గాడిద గుడ్డు

- ఓటమిలో రాహుల్, రేవంత్ పాత్ర అమోఘం
- ఎక్స్ వేదికగా మాజీ మంత్రి హరీశ్‌రావు ఎద్దేవా

హైదరాబాద్, ఫిబ్రవరి 8 (నమస్తే తెలంగాణ) : ఢిల్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గాడిద గుడ్డు మిగిలిందని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. హర్యానా, మహారాష్ట్రతోపాటు తాజాగా ఢిల్లీ ఎన్నికల్లో ఘోర పరాజయంలో రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి పాత్ర అమోఘమని శనివారం ఎక్స్ వేదికగా వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో హామీలు అమలుచేయకుండా ఇతర రాష్ట్రాల్లో ప్రచారం చేస్తే మీకు ఓట్లు పడతాయా? అని ప్రశ్నించారు. మీ గ్యారెంటీల నిజస్వరూపం దేశవ్యాప్తంగా బట్టబయలైందని విమర్శించారు. ఢిల్లీ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు ఆగమేఘాల మీద చేసిన కులగణన బెడిసికొట్టిందని విమర్శించారు. ఇప్పటికైనా తప్పులు ఒప్పుకుని రాష్ట్ర ప్రజలకు సీఎం రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పి మళ్లీ కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. 6 గ్యారెంటీలు, 420 హామీలను రాష్ట్రంలో అమలుచేసిన తర్వాతే ఇతర రాష్ట్రాల్లో ఎన్నికల ప్రచారానికి వెళ్లాలని సీఎం రేవంత్‌రెడ్డికి సలహా ఇచ్చారు. లేదంటే రేవంత్ ఎక్కడ అడుగుపెట్టినా ఇవే ఫలితాలు పునరావృతమవుతాయని, రానున్న స్థానిక ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్‌కు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

జగిత్యాలలో టీచర్‌పై పోక్సో కేసు

జగిత్యాల రూరల్, ఫిబ్రవరి 8: జగిత్యాలలోని ప్రైవేట్ స్కూల్లో విద్యార్థినితో అసభ్యకరంగా ప్రవర్తించిన టీచర్‌పై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం జగిత్యాల రూరల్ పరిధిలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో ఆరో తరగతి విద్యార్థిని పట్ల ఓ టీచర్ శనివారం అసభ్యకరంగా ప్రవర్తించాడు. విద్యార్థిని తల్లిదండ్రులకు తెలుపడంతో వారు జగిత్యాల రూరల్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు టీచర్‌పై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రూరల్ ఎస్ఐ సదాకర్ తెలిపారు.

వేధింపుల టీచర్‌పై దాడి

జనగామ చౌరస్తా, ఫిబ్రవరి 8 : విద్యార్థినులతో కొంతకాలంగా అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడన్న కారణంతో జనగామ జిల్లాకేంద్రంలోని ఓ ప్రైవేట్ స్కూల్ ఉపాధ్యాయుడికి శనివారం విద్యార్థినుల తల్లిదండ్రులు దేహశుద్ధి చేశారు. పోలీసులు ఉపాధ్యాయుడిని అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

డీటీసీ వద్ద 4 కోట్ల అక్రమాస్తులు

వరంగల్ డీటీసీ పుప్పాల శ్రీనివాస్ అరెస్ట్

సుబేదారి, ఫిబ్రవరి 8 :వరంగల్ డీటీసీ శ్రీనివాస్ 4 కోట్ల అక్రమాస్తులు కలిగి ఉన్నట్టు ఏసీబీ అధికారులు తెలిపారు. అవినీతి నిరోధకశాఖ అధికారులు హనుమకొండ పలివ్వేలులోని శ్రీనివాస్ నివాసంతోపాటు మరో 4 ప్రాంతాల్లో శుక్రవారం అర్ధరాత్రి వరకు దాడులు చేశారు. డీటీసీ మొత్తం రూ. 4,04,78,767 విలువైన అక్రమ ఆస్తులు కలిగి ఉన్నారని తేల్చారు. శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. శ్రీనివాస్ వద్ద రూ.2,79,32,740 విలువైన 3 ఇండ్లు, రూ.13,57,500 విలువైన 16 ఓపెన్ ప్లాట్లు, రూ.14,04,768 విలువైన 15.20 ఎకరాల వ్యవసాయ భూమి, రూ. 19,55,650 విలువైన 1542. 8గ్రాముల గోల్డ్, రూ.28వేల విలువైన 400 గ్రాముల వెండి ఉన్నట్టు చెప్పారు.

మరో రియల్టర్ బలవన్మరణం

మొదటిపేజీ తరువాయి...

తీసుకుంటున్నారని పరిశీలకులు చెప్తున్నారు. ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని మంగల్‌పల్లికి చెందిన కీలు కత్తి నర్సింహగౌడ్ (45) రియల్ ఎస్టేట్ వ్యాపారి. తనకు ట్రాక్టర్లు కూడా ఉండటంతో గ్రానైట్, ఇటుక, ఇసుక వ్యాపారం కూడా చేసేవారు. ఏడాదిగా రియల్‌ఎస్టేట్ వ్యాపారం పతనమవడంతో వ్యాపారం పూర్తిగా నిలిచిపోయింది. దీనికితోడు అప్పులు చేసి పెట్టిన పెట్టుబడులు కూడా వెనక్కి తెచ్చుకోలేని పరిస్థితి. దీంతో ఆర్థిక ఇబ్బందులు చుట్టుముట్టాయి. వాటి కారణంగా మరో 15లక్షల వరకు అప్పులయ్యాయి. ఈ నేపథ్యంలో ఇంట్లో కలహాలూ మొదలయ్యాయి. దీంతో కొంతకాలంగా తీవ్ర మానసిక సంఘర్షణకు లోనైన నర్సింహగౌడ్ శనివారం రాత్రి ఇంట్లో ఎవరూలేని సమయంలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. నర్సింహగౌడ్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని బంధువులు డిమాండ్ చేశారు.

దరఖాస్తుల ప'రేషన్'

మొదటిపేజీ తరువాయి..

జనాలు నిరుత్సాహంతో వెనుతిరిగారు. ప్రభుత్వ తీరుపై తీవ్రఆగ్రహం వ్యక్తంచేశారు. దరఖాస్తుల గోల ఏంటో అర్థంకావడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు.

సమన్వయలోపం.. సర్వం గందరగోళం

కొత్త రేషన్‌కార్డుల దరఖాస్తుల ప్రక్రియంతా గందరగోళంగా మారింది. మీ సేవ, సివిల్‌సప్లై అధికారుల మధ్య సమన్వయం లేకపోవడమే గందరగోళానికి కారణమని ప్రజల్లో అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దరఖాస్తుల స్వీకరణకు సంబంధించి ప్రభుత్వానికి తెలియకుండానే సివిల్‌సప్లై అధికారులు మీ

సేవకు లేఖ రాసినట్టుగా తెలిసింది. దీంతో మీ సేవ అధికారులు ప్రభుత్వాన్ని సంప్రదించగా దరఖాస్తులకు అవకాశమివ్వొద్దని అంతర్గత ఆదేశాలు జారీ చేసినట్టు విశ్వసనీయంగా తెలిసింది. ప్రభుత్వ ఆదేశాలతో మీ సేవ అధికారులు దరఖాస్తు స్వీకరణకు అనుమతి ఇవ్వలేదని సమాచారం. ప్రభుత్వ పెద్దలు సివిల్‌సప్లై అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేశారని, దరఖాస్తు కోసం ఎందుకు లేఖ రాశారని ప్రశ్నించినట్టుగా తెలిసింది.

రేషన్ దరఖాస్తుల నిలిపివేతపై ఆదేశాలివ్వలేదు

ఎమ్మెల్సీ కోడ్ నేపథ్యంలో మీ సేవ కేంద్రాల్లో రేషన్‌కార్డుల దరఖాస్తు ప్రక్రియను నిలిపివేయాలని తాము ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదని రాష్ట్ర ఎన్నికల సంఘం స్పష్టంచేసింది. ఈ మేరకు శనివారం రాష్ట్ర ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి ఓ ప్రకటన విడుదల చేశారు. కొన్ని చానళ్లు, సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని నమ్మవద్దని కోరారు.

దరఖాస్తుల పేరిట రేవంత్‌రెడ్డి మోసం: హరీశ్‌రావు

హైదరాబాద్, ఫిబ్రవరి 8 (నమస్తే తెలంగాణ): రేషన్‌కార్డుల దరఖాస్తుల పేరిట సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలను ఇంకెన్నిసార్లు మోసం చేస్తారని మాజీమంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రశ్నించారు. ప్రభుత్వంపై 'ఎక్స్' వేదికగా మండిపడ్డారు. ప్రజాపాలన పేరిట దరఖాస్తులు తీసుకున్నారని, కులగణనలో వివరాలు నమోదు చేసుకున్నారని గుర్తుచేశారు. గ్రామసభల పేరిట డ్రామా చేశారని మండిడ్డారు. మళ్లీ ఇప్పుడు మీ సేవలో దరఖాస్తు చేసుకోవాలని అనడమేంటని సర్కారుపై ఆగ్రహం వ్యక్తంచేశారు. పథకాల పేరిట ఇన్నాళ్లు చేసిన హడావుడి స్థానిక సంస్థల ఎన్నికల కోసం చేసిన గారడీయేనా? అని ప్రశ్నించారు. ప్రజాపాలన, గ్రామసభల దరఖాస్తులకు విలువ లేదా అని ఆగ్రహం వ్యక్తంచేశారు. బీఆర్ఎస్ పాలనలో దరఖాస్తు, దస్త్రం లేకుండా రాష్ట్రంలో పథకాల అమలు జరిగిందని గుర్తుచేశారు. కానీ కాంగ్రెస్ పాలనలో దరఖాస్తులు అంటూ మోసం చేస్తున్నారని మండిపడ్డారు. పేదలకు రేషన్‌కార్డులు, పథకాలు అందించాలనే ఆలోచన కంటే కోతలతో ఎలా అందకుండా చేయాలన్న దానిపైనే ప్రభుత్వం దృష్టి ఉందని ఎద్దేవాచేశారు. దరఖాస్తుల పేరిట కాలయాపన చేయడం మానుకుని, పేదలకు పథకాలు అందజేయాలని హితవు పలికారు. ఇచ్చిన మాట ప్రకారం రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, రైతుభరోసా, ఆత్మీయభరోసా పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

డీ లిమిటేషన్ తర్వాతే మున్సిపల్ ఎన్నికలు!

- కసరత్తు చేస్తున్న సర్కారు
- నెల రోజులపాటు ప్రక్రియ

హైదరాబాద్, ఫిబ్రవరి 8 (నమస్తే తెలంగాణ): మున్సిపల్ ఎన్నికల నిర్వహణపై స్పష్టత కొరవడింది. సర్పంచ్ ఎన్నికలకు ముందే మున్సిపాలిటీ, మున్సిపల్ కార్పొరేషన్లకు నిర్వహించాలని ప్రభుత్వం యోచిస్తున్నది. అందులో భాగంగానే మున్సిపల్, కార్పొరేషన్లలో విలీనమైన గ్రామాలు, కొత్త కాలనీలు, ఓటర్ల వివరాలతో డీ లిమిటేషన్ ప్రక్రియను నిర్వహిస్తున్నారు. దాదాపు నెలపాటు డీ లిమిటేషన్ ప్రక్రియ కొనసాగనున్నట్టు సమాచారం.

- యాదగిరీశుడి సన్నిధిలో సీజే

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి వారిని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజయ్‌పాల్ శనివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. సీజేకు ఆలయ ప్రధానార్చకులు, వేద పండితులు చతుర్వేద ఆశీర్వచనం ఇచ్చారు. ఆలయ ఈవో భాస్కర్‌రావు స్వామివారి ప్రసాదం, చిత్రపటాన్ని అందజేశారు. – యాదగిరిగుట్ట

పనుల్లేవ్.. పైసల్లేవ్.. పదవుల్లేవ్

మొదటిపేజీ తరువాయి...

సర్పంచ్ ఎన్నికలను ఎదుర్కోవడం ఎలా అని పార్టీ పెద్దల్ని నిలదీస్తున్నారు. ఇందుకు సంబంధించి పార్టీలో, ప్రభుత్వంలో ప్రస్తుత పరిస్థితులపై కాంగ్రెస్ ఎమ్మెల్యేల్లో అనేక చర్చలు జరుగుతున్నాయి.

ఏడాదైనా..బాధ తీరట్లే!

సొంత సర్కారు పనితీరుపై కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నట్టు సమాచారం. అధికారంలోకి వస్తే ఏమైనా పనులు చేసుకొని నష్టాలను భర్తీ చేసుకోవచ్చని భావించామని, కానీ ఇందుకు పూర్తి విరుద్ధంగా పరిస్థితి ఉందంటూ వారు తమ సన్నిహితుల వద్ద ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వచ్చి ఏడాది పూర్తయినా ఒక్కటంటే ఒక్క పని కూడా కాలేదని ఓ ఎమ్మెల్యే తన బాధను చెప్పుకొన్నారు. పనుల కోసం మంత్రులను, ప్రభుత్వాన్ని సంప్రదించినా ఫలితం దక్కడం లేదని మండిపడ్డారు. దీంతో ఖర్చులకు కూడా పైసలు లేకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో చేసిన అప్పులకు వడ్డీ పెరిగిపోతున్నదని, కనీసం ఆ అప్పు కూడా తీర్చే మార్గం దొరకడం లేదని ఆవేదన చెందారు. ప్రభుత్వంలోకి వచ్చిన తర్వాత కూడా ప్రతిపక్షంలో ఉన్నప్పటి మాదిరిగానే అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొన్నదని వాపోయారు. అయితే ప్రతిపక్షంలో ఉన్నప్పుడైనా అప్పులు ఇచ్చారని, కానీ ఇప్పుడు అధికారంలో ఉన్నా.. ఎక్కడా అప్పు పుట్టడం లేదని అంటున్నారు. అధికారంలో ఉన్నాం కాబట్టి.. సహజంగానే తమపై ప్రజలకు, కార్యకర్తలకు అంచనాలుంటాయని, ఆ అంచనాలకు తగ్గట్టే ఖర్చులు భారీగా పెరిగాయని అన్నారు. ఉత్తర తెలంగాణకు చెందిన ఓ ఎమ్మెల్యే .. ఓ చిన్న వ్యాపారిని రూ. 5 లక్షల అప్పు అడిగినట్టు తెలిసింది. అయితే ఆయన అప్పు ఇచ్చేందుకు సున్నితంగా తిరస్కరించారని సమాచారం. దీంతో సదరు ఎమ్మెల్యే తన పరిస్థితి, పరపతిపై తనకుతానే కార్యకర్తల వద్ద విమర్శించుకున్నట్టు తెలిసింది.

ఓట్లు ఎలా అడగాలి?

ప్రభుత్వ పథకాల అమలులో వైఫల్యంతో తాము గ్రామాలకు వెళ్లలేని పరిస్థితి నెలకొందని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఏ పథకాన్ని ప్రభుత్వం సక్కగా అమలు చేసిందని వారు ప్రశ్నిస్తున్నారు. ఒక్క పథకాన్ని కూడా కోతలు లేకుండా అమలు చేయలేకపోయారని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. రుణమాఫీలో కోతలు పెట్టి సగమే అమలు చేశారు, రేషన్ కార్డులకు దరఖాస్తులు తీసుకున్నారు తప్ప వాటికి అతీగతీ లేదు, ఇందిరమ్మ ఇండ్లపై నాలుగుసార్లు ప్రకటన చేసి ఇంకా ప్రారంభించలేదు, రైతుభరోసా పంపిణీ జరుగలేదు.. ఇలా ఏ పథకం చూసినా అరకొరగా అమలవుతున్నదని అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. ప్రభుత్వం తీరుపై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని, ఈ పరిస్థితుల్లో గ్రామాల్లోకి వెళ్లలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఊర్లలోకి వెళ్లి సర్పంచ్ ఎన్నికల్లో ప్రజలను ఓట్లు ఎలా ఆడగాలని అధిష్ఠానాన్ని నిలదీస్తున్నారు.

సర్పంచ్‌లు ఏకగ్రీవం ఎలా చేయాలి...?

రెండు రోజుల క్రితం జరిగిన సీఎల్పీ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి పార్టీ ఎమ్మెల్యేలకు పలు ఆదేశాలు, సూచనలు జారీ చేశారు. ఇందులో ప్రధానమైనది.. సర్పంచ్ ఎన్నికలను ఏకగ్రీవం చేయాలి. దీనిపై ఎమ్మెల్యేలు తమదైన శైలిలో స్పందిస్తున్నారు. 'ఏకగ్రీవం చేయాలని చెప్పడం సులువే.. కానీ ఎలా చేయాలో కూడా చెప్పాలి కదా' అంటూ ఓ ఎమ్మెల్యే పార్టీ పెద్దల్ని ప్రశ్